# బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శనివారం 16 నవంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4


## నేత కార్మికులెవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దు..

- నేత కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుంది..
- శాంతియుతంగా నిరసన తెలుపవచ్చు.. దాడులు చేస్తే కఠిన చర్యలు తప్పవు..
- ప్రతీ కాంగ్రెస్ కార్యకర్తకు అండగా ఉంటాం..
- రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.

వివరాలు 2వ పేజీలో

# ప్రధాని మోడీ విమానంలో సాంకేతిక లోపం..



## రాహుల్‌గాంధీ హెలీకాప్టర్‌లోనూ..

### ఆలస్యంగా ఢిల్లీకి పయనం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఝార్ఖండ్‌లో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. శుక్రవారంఎన్నికల ప్రచారంలో మోదీ పాల్గొన్నారు. అనంతరం ఢిల్లీకి వెళ్లేందుకు డియోఘర్ విమానాశ్రయానికి చేరుకున్నారు. అయితే, మోదీ దేశ రాజధాని ఢిల్లీకి వెళ్లే విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. అప్రమత్తమైన అధికారులు పరిస్థితిపై వేగంగా స్పందించి విమానాన్ని అక్కడే నిలిపివేశారు. టెక్నికల్ బృందాలు సమస్యను పరిష్కరించినట్టు అధికారులు వెల్లడించారు. మోదీ విమానాన్ని ఝార్ఖండ్‌లోనే నిలిపివేశారు. దేశ రాజధానికి మోదీ తిరిగి రావడం ఆలస్యమైందని సంబంధిత అధికారులు తెలిపారు.

ప్రధాని ప్రయాణిస్తున్న విమానంలో సాంకేతిక లోపానికి గల కారణాలను అధికారులు ఇంకా వెల్లడించలేదు. గిరిజన వీరుడు బిర్సా ముండాను సన్మానించే కార్యక్రమంలో భాగంగా ఝార్ఖండ్‌లో జన్ జాతీయ గౌరవ్ దివస్ వేడుకల్లో భాగంగా ప్రధాని ఈరోజు రెండు ర్యాలీలు నిర్వహించారు.




**రాహుల్ గాంధీ హెలీకాప్టర్‌లోనూ...**

మరోవైపు.. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రయాణించే



# ఒక్క దీపాన్ని సంరక్షించినా అది మనకు ముక్తిని కలిగిస్తుంది

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



"ఒక్క దీపాన్ని వెలిగించినా, ఒక్క దీపాన్ని సంరక్షిం చినా అది మనకు ముక్తిని కలిగిస్తుంది. సమాజానికి మేలు జరుగుతుందని వేదపండితులు బోధిస్తున్నారు. అలాంటిది కోటి దీపోత్సవ కార్యక్రమం నిర్వహించడం అభినంద నీయం" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కార్తీక పూర్ణిమ శుభవేళ రేవంత్ రెడ్డి సతీసమేతంగా ఎన్‌టీవీ, భక్తి టీవీ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న కోటి దీపోత్సవంలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమ స్ఫూర్తిగా రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో దీపోత్సవం జరుగుతుందని సీఎం చెప్పారు. కోటి దీపోత్సవం నిర్వహించి దాని గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన యాజమాన్యాన్ని అభినందించారు. ఆనాటి త్రిలింగ క్షేత్రమే ఈనాటి తెలంగాణ రాష్ట్రం. ఇది శైవ క్షేత్రం. వేయి స్తంభాల గుడి, రాజన్న దేవాలయం, అలంపూర్ క్షేత్రం, మల్లికార్జున దేవాలయం ఈ త్రిలింగ దేశంలో నలువైపులా శివ భక్తులు ఉన్నారని, వారితో ప్రపంచమంతా వీక్షించేలా దీపోత్సవం నిర్వహించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి వారిని ఆహ్వానించి భక్తకోటిని అందర్నీ వారిచేత ఆశీర్వదింపజేసినందుకు తెలంగాణ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. అంతకుముందు సీఎం మహాకాళేశ్వరునికి కోటి పుష్పార్చనలో పాల్గొని అగ్నిలింగ క్షేత్రం తిరువణ్ణామలై శ్రీ అరుణాచలేశ్వర స్వామి వారి కళ్యాణమహోత్సవాన్ని వీక్షించారు. వేదికపై స్వర్ణలింగానికి రజిత బిల్వార్చన, అష్టోత్తరశత స్వర్ణపుష్పార్చన నిర్వహణ అనంతరం అవధూత దత్తపీఠం (మైసూరు) పూజ్యశ్రీ గణపతి సచ్చిదానంద స్వామి వారి ఆశీర్వచనాలను తీసుకున్నారు. తర్వాత జ్వాలతోరణ మహోత్సవంలో పాల్గొనడంతో పాటు గణపతి సచ్చిదానంద స్వామి వారితో కలిసి వేదికపై కార్తీక దీపారాధన చేశారు.

# సోలార్ పవర్ ఉత్పత్తికి చర్యలు ప్రారంభించాలి

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**


**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల సభ్యులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం ప్రజాభవన్లో జరిగిన అధికారుల సమావేశంలో ఆయన స్పష్టం చేశారు. స్వయం సహాయక సంఘాల ఫెడరేషన్ల ద్వారా రాష్ట్రంలో పెద్ద ఎత్తున సోలార్ పవర్ ఉత్పత్తికి త్వరితగతన చర్యలు ప్రారంభించాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల ఫెడరేషన్లకు అవసరమైన స్థలాలను సేకరించి వారికి లీజుకు ఇవ్వాలని తెలిపారు.

సోలార్ పవర్ ఉత్పత్తికి అవసరమైన ఆర్థిక నిధులకు గాను బ్యాంకర్లతో సమావేశం ఏర్పాటు చేసి రుణాలు ఇప్పించే ఏర్పాటు చేయాలని తెలిపారు. రుణాల రీ పేమెంట్ లో స్వయం సహాయక సంఘాల సభ్యులు 99 శాతం ప్రగతిని కనబరుస్తున్నారని, వీరికి రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు ఆసక్తిగా ఉన్నారని చెప్పారు. ఇటీవల బ్యాంకర్ల సమావేశంలోనూ స్వయం సహాయక సంఘాల సభ్యులు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు సోలార్ పవర్ ఉత్పత్తి ప్లాట్ల ఏర్పాటు, ఆర్టీసీకి బస్సుల సమకూర్చేటువంటి మరిన్ని పథకాలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురానున్నట్టు స్పష్టం చేశామని తెలిపారు.

వారు కూడా విరివిగా రుణాలు అందించి ఆర్థికంగా ప్రోత్సాహం అందిస్తామని స్పష్టం చేసిన విషయాన్ని డిప్యూటీ సీఎం అధికారులకు వివరించారు. మహిళా సంఘాలకు ఆర్థిక చేయూతను ఇవ్వడం ద్వారా, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం ద్వారా సామాజిక మార్పు సాధించేందుకు అవకాశం ఏర్పడుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా బలపడితే గ్రామీణ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం అయ్యేందుకు అవకాశం ఏర్పడుతుందని అధికారులకు డిప్యూటీ సీఎం వివరించారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్, ఎస్ఈఆర్పీ సీఈఓ దివ్య దేవరాజన్, ట్రాన్స్కో సీఎం డి కృష్ణ భాస్కర్, రెడ్కో వైస్ చైర్మన్,ఎండి వావిలాల అనీల తదితరులు పాల్గొన్నారు.



## రైలులో రీల్స్ చేస్తే కఠిన చర్యలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రైళ్లు, రైల్వే ప్లాట్‌ఫాంలు, మెట్రో రైళ్లలో రీల్స్ చేస్తూ ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తే ఇకపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోనుంది. అలాంటి వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని రైల్వే బోర్డు అన్ని జోన్లకు ఆదేశాలు జారీ చేసింది. వారు కోచ్‌లో కానీ, రైల్వే ప్రాంగణంలో కానీ రైల్వే కార్యకలాపాలకు ఆటంకం కలిగిస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని తమ ఆదేశంలో పేర్కొంది. కొంతమంది ప్రమాదాలను సైతం లెక్క చేయకుండా వ్యూస్ కోసం డ్యాన్స్‌లు, ప్రమాదకర స్టంట్‌లతో రీల్స్ చేస్తున్నారు. అవి తోటి ప్రయాణికులను చాలా ఇబ్బంది పెడుతున్నాయి. దీనిపై పలువురు ఫిర్యాదులు కూడా చేస్తున్నారు. ఇటీవల రైల్వే ట్రాక్‌పై ఆగిపోయిన ఒక ఎస్‌యూవీ వాహనాన్ని చూసిన గూడ్స్ డ్రైవర్ అప్రమత్తమై రైలును నిలిపివేశాడు. తీరా అది ప్రమాదవశాత్తు ఆగిపోలేదని, ఒక స్టంట్‌కు సంబంధించి రీల్ కోసం దానిని ట్రాక్‌పై ఆపినట్టు తెలుసుకున్నారు. ఇలాంటివి దేశ వ్యాప్తంగా అనేక ఘటనలు వెలుగుచూస్తున్నాయి.

# శబరిమల వెళ్లే అయ్యప్ప భక్తులకు ప్రత్యేక రైళ్లు




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

శబరిమల వెళ్లే అయ్యప్ప భక్తులకు రైల్వే శాఖ శుభవార్త తెలిపింది. 8 ప్రత్యేక రైళ్లను శబరిమలకు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఈ నెల 22, 29 తేదీల్లో మౌలాలి నుంచి కొల్లాంకు రైలు బయల్దేరనుండగా ఈ నెల 24, డిసెంబర్ 1న కొల్లాం - మౌలాలికి తిరుగు ప్రయాణం ఉంటుంది. ఈ నెల 18, 25వ తేదీల్లోనూ మచిలీపట్నం - కొల్లాంకు రైలు వెళ్లనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. కొల్లాం %-% మచిలీపట్నం తిరుగు ప్రయాణానికి ఈ నెల 20, 27 తేదీల్లో ప్రత్యేక రైళ్లు నపడనున్నట్లు వెల్లడించింది. హైదరాబాద్ మౌలాలీలో ఈ నెల 23, 30న 07141 నంబరు గల రైలు మధ్యాహ్నం 2.45 గంటలకు బయల్దేరి తర్వాత రోజు తెల్లవారుజామున 2.50 గంటలకు కడప, రాత్రి 10.30 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 25, డిసెంబర్ 2వ తేదీల్లో 07142 నంబర్ గల రైలు కొల్లాంలో తెల్లవారుజామున 2.30 గంటలకు బయల్దేరి, అదే రోజు రాత్రి 11 గంటలకు కడపకు, తర్వాతరోజు మధ్యాహ్నం ఒంటి గంటకు మౌలాలీకి చేరుకుంటుంది.కడప మీదుగా కేరళలోని కొట్టాయం, కొల్లాంలకు ఈ నెలలోనే 4 ప్రత్యేక రైళ్లను నడపనున్నాయి.

ఈ నెల 21, 28 తేదీల్లో 07133 నంబరు గల రైలు కాచిగూడలో మధ్యాహ్నం 3.40 గంటలకు బయలుదేరి అదేరోజు రాత్రి 12.10 గంటలకు కడపకు చేరుకుంటుంది. తర్వాత రోజు సాయంత్రం 6 గంటల 50 నిమిషాలకు కొట్టాయం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 07134 గల రైలు ఈనెల 22, 29 తేదీల్లో రాత్రి 8.30 గంటలకు కొట్టాయం నుంచి బయల్దేరి మరుసటి రోజు మధ్యాహ్నం ఒంటి గంటకు కడపకు, రాత్రి 11:40 నిమిషాలకు కాచిగూడకు చేరుకుంటుంది. హైదరాబాద్‌లో ఈ నెలలో 19, 26వ తేదీల్లో 07135 నంబరు గల రైలు మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి రాత్రి 10.25 గంటలకు కడపకు, మరుసటి రోజు సాయంత్రం 4 గంటలకు కొట్టాయంకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 07136 గల రైలు ఈ నెల 20, 27 తేదీల్లో సాయంత్రం 6.10 గంటలకు కొట్టాయంలో బయలుదేరి తర్వాత రోజు ఉదయం 11.50 గంటలకు కడపకు, రాత్రి 11 గంటల 45 నిమిషాలకు హైదరాబాద్‌కు చేరుకుంటుంది.

# పేద గిరిజన రైతులపై నీ ప్రతాపమా?

- చేతనైతే మాతో కొట్లాడు.
- నీ కుటుంబం కోసం పేదలపై దౌర్జన్యం, అరా చకాలు చేస్తానంటే తెలంగాణ సమాజం ఊరుకోదు
- ఇయ్యాల కొడంగల్ మర్లబడ్డది.. రేపు తెలంగాణ మొత్తం మర్లవడుతది.
- రైతులు ధైర్యంగా ఉండండి మీకు కేసీఆర్ ఉన్నాడు
- ఎన్ని అక్రమ కేసులు పెట్టినా సరే మేము ఎదుర్కొంటాం. మీ తరఫున పోరాటం చేస్తాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- సంగారెడ్డి జైల్లో లగచర్ల బాధిత రైతులను కలిసిన కేటీఆర్



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

పేద గిరిజన రైతులపై నీ ప్రతాపమా..? సీఎం రేవంత్ రెడ్డి దమ్ముంటే మాతో కొట్లాడు.. రాజకీయంగా తలపడు కానీ పేదలకు మాత్రం కష్టం కలిగించొద్దు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. లగచర్ల రైతులపై నమోదు చేసిన కేసులన్నీ రద్దు చేసి, వెంటనే వారిని జైళ్ల నుంచి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంగారెడ్డి జైల్లో లగచర్ల రైతులతో ములాఖత్ అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.

హైదరాబాద్ శివార్లలో ఫార్మాసిటీ కేసీఆర్ పెడితే రేవంత్ వాళ్ల కుటుంబ సభ్యుల కోసం మార్చారు. లగచర్లతో పాటు సంగారెడ్డి జిల్లా న్యాలకల్‌లో కూడా రైతులు పోరాటం చేస్తున్నారు. కేసీఆర్ మీకు అండగా ఉంటారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ఎదుర్కొంటాం.. ఈ ప్రభుత్వానికి తప్పకుండా పేదవాడి ఉసురు తగులతది. 30, 40 కిలోల బరువు లేని పిల్లలు కలెక్టర్‌పై హత్యాయత్నం చేశారని కేసులు పెట్టడానికి మనసు ఎలా ఒప్పింది రేవంత్ రెడ్డి..? చేతనైతే మాతో కొట్లాడు. రాజకీయంగా మాతో తలపడు. పేదలకు కష్టం కలిగించొద్దు. ఈ కేసులన్నీ రద్దు చేసి రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాను. రైతులకు, పేదలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది. గర్భిణి అయిన జ్యోతిని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ రేపు హాస్పిటల్‌కు తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయిస్తుంది. పేద వర్గాలకు అండగా నిలబడడమే బీఆర్ఎస్ పార్టీ లక్ష్యమని కేటీఆర్ స్పష్టం చేశారు.

లగచర్ల ఘటనలో కాంగ్రెస్ కార్యకర్తలను వదిలేసి కేవలం బీఆర్ఎస్ కార్యకర్తలనే జైల్లో వేశారని కేటీఆర్ పేర్కొన్నారు. అధికారులపై దాడికి పాల్పడ్డ వారిలో కాంగ్రెస్ కార్యకర్తలు కూడా ఉన్నారని కేటీఆర్ తెలిపారు. తమ భూములు తమకే ఉండాలని లగచర్ల రైతులు పోరాడుతున్నారు. మార్కెట్‌లో ఎకరం రూ. 70 లక్షల విలువ ఉన్న భూములను అడ్డికి పావుశేరుకు రియల్ ఎస్టేట్ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం గుంజేసుకుంటుందని రైతులు చెబుతున్నారు. కేవలం ఎకరం భూమి రూ. 10 లక్షలకు గుంజేసుకుంటున్నారని రైతులు బాధపడుతున్నారు. ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా రైతులు 9 నెలలగా పోరాటం చేస్తున్నారు. లగచర్ల, హకీంపేటతో పాటు మరో రెండు తండాల ఆడబిడ్డలు రోదిస్తున్నారు. కష్టపడి సాధించుకున్న తెలంగాణలో రేవంత్ రెడ్డి రాబందు మాదిరిగా వ్యవహరిస్తున్నారు. ఫార్మా కంపెనీలు కాలుష్యమని ఆయన ప్రచారం చేశారు. అదే ఫార్మాను కొడంగల్ తెస్తా.. 3 వేల ఎకరాలు రావాలని పేదల భూములు గంజుకుంటున్నారు. దీంతో స్థానిక రైతులు మర్లబడ్డారు. 9 నెలలుగా పోరాటం చేస్తున్నా ఎవరూ పట్టించుకోలేదు. అధికారుల ముందు నిరసన తెలిపితే దాడుల పేరిట అరెస్టులు చేసి జైల్లో వేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు.

ఇవాళ లగచర్లలో దుర్మార్గమైన పరిస్థితి నెలకొని ఉంది. కులగణనలో పాల్గొని వచ్చిన పంచాయతీ సెక్రటరీని కూడా అరెస్టు చేసి జైల్లో వేశారు. ఆ సంఘటనలో పాల్గొనలేదు.. అయినా తనను జైల్లో వేశారని ఆ యువకుడు చెబుతున్నాడు. ఇంకో యువకుడు వనపర్తిలో చదవుకుంటున్నాడు. ఈ ఘటన గురించి తెలుసుకుని మా ఇంటి వాళ్లు ఎలా ఉన్నారో అని వస్తే నన్ను కూడా తీసుకెళ్లారని చెప్పారు. 70 మందిని అరెస్టు చేసి రెండు డీసీఎంలలో తీసుకెళ్లారని చెప్పారని కేటీఆర్ తెలిపారు. దుద్యాల మండల పార్టీ అధ్యక్షుడు శేఖర్ అనుచరులు కూడా ఈ దాడుల్లో పాల్గొన్నారు. వారి భూములు కూడా ఈ ఫార్మా విలేజ్‌లో పోతున్నాయి. రమేశ్, నర్సింహులు, రాములు అనే కాంగ్రెస్ కార్యకర్తలు కూడా దాడులు చేశారు. 70 మందిని తీసుకెళ్తే.. తిరుపతి రెడ్డి ఆదేశాల మేరకు

మిగితా 3వ పేజీలో

# కేటీఆర్‌కు, హరీశ్‌రావుకు పొసగడం లేదు

- టీపీసీసీ చీఫ్ మహేశ్

**బలగం టీవి, హైదరాబాద్**

బీఆర్ఎస్‌లో హరీశ్‌రావు, కేటీఆర్‌కు పొసగడం లేదనే సమాచారం తమకు ఉందని, రాబోయే రోజుల్లో ఈ ఇద్దరు ఒకే పార్టీలో ఉండరని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అలాగే త్వరలోనే కాంగ్రెస్ పార్టీలోకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరికలు ఉంటాయన్నారు. తమ పార్టీలో చేరేందుకు చాలామంది ఎమ్మెల్యేలు ఆసక్తితో తమకు అర్జీలు పెట్టుకున్నారని కానీ తామే తుది నిర్ణయం తీసుకోవడంలో సమాలోచనలు చేస్తున్నామని చెప్పారు.

శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ జీరో స్థానాలు సాధించాక ఇక ఆ పార్టీ మనుగడ సాధిస్తుందని తాను అనుకోవడం లేదన్నారు. వచ్చే ఎన్నికల నాటికి ఆ పార్టీ కనుమరుగై రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీనే ఉంటాయన్నారు. బీఆర్ఎస్ బీజేపీలో మెర్జ్ కావడమో? మెజార్టీ బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో కలవడమో జరుగుతుందన్నారు. కేసీఆర్ ఎవరి ఒత్తిడితో బయటకు రావడం లేదని ప్రశ్నించారు. కేటీఆర్ తన రాజకీయాల కోసం ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్‌ను నిర్బంధించారని సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యేలు చేరిన చోట్లలో కొత్త, పాత నేతల మధ్య కొంత ఇబ్బందులు ఉన్నమాట వాస్తవమేనని, వాటిని సెట్ రైట్ చేసుకుంటూ ముందుకు వెళ్తామని మహేశ్ గౌడ్ తెలిపారు. కొత్త ఎమ్మెల్యేలు పార్టీలోకి వచ్చి చేరినా పార్టీలో పదవులు, ప్రయార్టీ పాత కాంగ్రెస్ నేతలకే ఉంటుందన్నారు.కొత్త ఎమ్మెల్యేల అనుచరులు పదవుల కోసం కొంచెం ఆగాలని సూచించారు. మంత్రివర్గ విస్తరణపై సంప్రదింపులు పూర్తయ్యాయన్నారు.జిల్లాల్లో తాను పర్యటించబోతున్నానని, కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకువెళ్తామన్నారు.

# నేడు మూసీ పక్కనే పేదల ఇళ్లలో నిద్రిస్తాం




- ఎదల కోసం చావడానికైనా సిద్ధం
- వనవాసి, గ్రామవాసి, నగరవాసి సమ్మేళనంతో లోక్ మంథన్
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

గతంలో సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన సవాల్‌ను స్వీకరిస్తున్నామని.. శనివారం పేదల ఇళ్లలో మూసీ పక్కనే నిద్రిస్తామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. పేదల కోసం చావడానికైనా సిద్ధమేనని అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర ఎన్నికల్లో ప్రచారం చేస్తున్న రేవంత్ రెడ్డి పూర్తిగా అబద్దాలే చెప్తున్నారని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా.. ఆరు గ్యారెంటీలు అమలు చేస్తున్నామని అబద్దాలు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. పేదల ఇండ్లు కూల్చకుండా మూసీ ప్రక్షాళన చేస్తే.. తమ పూర్తి మద్దతు ఉంటుందని చెప్పుకొచ్చారు. పేదల కోసం చావటానికైనా సిద్ధమేనని చెప్పుకొచ్చారు. మాజీ సీఎం కేసీఆర్ తరహాలోనే

మిగితా 3వ పేజీలో

# నేత కార్మికులెవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దు..



- నేత కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుంది..
- శాంతియుతంగా నిరసన తెలుపవచ్చు.. దాడులు చేస్తే కఠిన చర్యలు తప్పవు..
- ప్రతీ కాంగ్రెస్ కార్యకర్తకు అండగా ఉంటాం..
- రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

నేత కార్మికులు ఎవరూ అధైర్యపడవద్దని, మనస్థాపం చెంది ఆత్మహత్యలు చేసుకోవద్దని, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉండి, ఆదుకుంటామని రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల కేంద్రంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా నాగుల సత్యనారాయణ గౌడ్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగారవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. ముందుగా నేతన్న విగ్రహం నుండి లైబ్రరీ మీదుగా లహరి ఫంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

అనంతరం లహరి ఫంక్షన్ హాల్ లో నాగుల సత్యనారాయణ గౌడ్ చేత జిల్లా గ్రంథాలయ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డా,,రియాజ్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 10 సంవత్సరాలు తెలంగాణ రాష్ట్రంలో యువరాజు లా పరిపాలించిన సిరిసిల్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బతికి ఉండడానికి కష్టపడ్డ కాంగ్రెస్ కార్యకర్తలకు అభినందనలు తెలిపారు.జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గా నాగుల సత్యనారాయణ ఎంతో కష్టపడ్డారు అని, ముఖ్యమంత్రి మీకు ఇచ్చిన లైబ్రరీ చైర్మన్ ఇచ్చాడని, భవిష్యత్ లో రాష్ట్ర స్థాయి బాధ్యతలు వస్తాయని అన్నారు.

ఎన్ని కష్టాలు వచ్చిన బాధలు వచ్చిన పార్టీ నీ పట్టుకొని శ్రమపడ్డారు,కరీంనగర్ లోక్ సభ పరిధిలో నలుగురు ఎమ్మెల్యేలు ఉన్నామని,ఇక్కడ ఉన్న కార్యకర్తలకు ఎక్కడ లోటు రాకుండా, అభివృద్ధి కి ఇబ్బంది లేకుండా చూసుకుంటామని అన్నారు.

దక్షిణ కాశి గా పిలువబడే వేములవాడ క్షేత్రానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 20 వ తేది న వస్తున్నారని,అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతారని అన్నారు.పార్లమెంటు ఎన్నికల్లో మన అభ్యర్థి ప్రకటించడం కొంత ఆలస్యంగా అయినా ఎన్నికల్లో కష్టపడ్డాం అని, అదేవిధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకునేలా కష్టపడాలి అని అన్నారు.



48 గంటల్లో మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం,10 లక్షల ఆరోగ్య శ్రీ,200 కి యూనిట్ల విద్యుత్ ,500 గ్యాస్ అందిస్తున్నామని, 5 లక్షల రూపాయల తో ఇందిరమ్మ ఇల్లు ఎంపిక ప్రక్రియ జరుగుతుంది అని అన్నారు. గత ప్రభుత్వం లక్ష రూపాయల రుణమాఫీ, 5 సంవత్సరాలుగా చేశారు అని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఒకేసారి రెండు లక్షల రూపాయల లోపు రుణమాఫీ చేసిం దని,2 లక్షల పైన ఉన్నవారికి కూడా 2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని అన్నారు.ప్రజాస్వామ్యంగా ప్రభుత్వా న్ని నడుపుతున్నం,గతంలో నిరసనలకు తావు లేదు, సెక్షన్ 30 అమలు ఉండే, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిరసనలు ఎక్కడైనా చెప్పుకోవచ్చు కానీ పరిధి దాటితే చర్యలు తప్పవు అని అన్నారు.

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు,కలెక్టర్, ఐఏఎస్ ల మీద దాడి జరిగితే అరెస్టు కాకుండా ఏం చేయాలో కిషన్ రెడ్డి చెప్పాలి అని అన్నారు.ఇందిరా పార్క్ దగ్గర ధర్నా చేయచ్చు,ఎక్కడైనా నిరసన తెలపవచ్చు, కానీ దాడి చేస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవు అని అన్నారు. స్వేచ్ఛగా నిరసనలు తెలపాలని మా పోలీసులు సూచనలు చేస్తే దాడులు చేస్తారా,గతంలో మల్లన్న సాగర్ బాధితులను ఎన్ని ఇబ్బందులు పెట్టరు, బీఆర్ఎస్ నాయకులు మర్చిపోయారా అని ప్రశ్నించారు. 30 సంవత్సరాలు ఎన్ఎస్యూఐ కార్యకర్త గా ఉన్న నేను మంత్రి అయ్యా,పార్లమెంటు పరిధిలో మీ సమస్యలు తెలుసుకోవడానికి,తోటి కాంగ్రెస్ కార్యకర్త గా సహకార కాంగ్రెస్ కుటుంబ సభ్యులకు నిరంతరం అందుబాటులో ఉంటా అని అన్నారు.

ఇక్కడి ఎమ్మెల్యే, ఎంపి 10 సంవత్సరాలు అధికారంలో ఉండి ఏం చేశారో చెప్పాలి అని అన్నారు.కార్యకర్తలు కష్టపడి పనిచేసి బాధ్యతగా ముందుకు కదలాలి,కష్టపడి పనిచేసిన వారికి పదవులు వస్తాయి అని అన్నారు. నాగుల సత్యనారాయణ లైబ్రరీ చైర్మన్ అయ్యారు,డా, రియాజ్ తెలంగాణ స్టేట్ లైబ్రరీ చైర్మెన్ అయ్యాడు, చాల తెలివిమంతుడు,ప్రొఫెసర్ ఉద్యమకారుడు, ఇద్దరు కలిసి నిరుద్యోగులందరికీ అవసరమైన పుస్తకాలు తెప్పించాలని అన్నారు.

ప్రభుత్వం ప్రకటించిన జాబ్ కేలండర్ లో సిరిసిల్ల జిల్లా ఉద్యోగాల్లో ప్రథమ స్థానంలో ఉండాలి,చాచా నెహ్రూ జయంతి సందర్భంగా లైబ్రరీ వారోత్సవాలు నడుస్తున్నాయని అన్నారు.

పుస్తకాలు చదివే అలవాటు విద్యార్థి దశ నుండే అలవాటు చేసుకోవాలి,లైబ్రరీ చైర్మన్ అంటే నిరుద్యోగులకు అవసరమయ్యే పుస్తకాలు ,పోటీ పరీక్షలు అందించి వారికి ఉద్యోగాలు కల్పించాలి అని అన్నారు.కాంగ్రెస్ కార్యకర్తలకు ఏ పని ఉన్న స్థానిక నేతలు కార్యకర్తలకు అండగా ఉండాలి, కాంగ్రెస్ కార్యకర్తలకు మేము ఉన్నామని భరోసా ఇవ్వాలని అన్నారు.పార్లమెంటు సభ్యుడిగా ఉన్నప్పుడు సిరిసిల్ల చేనేత కార్మికుల కోసం మనోధైర్య యాత్రచేశానని, ఇప్పుడు మళ్లీ చేనేత కార్మికుల ఆత్మహత్యలు వినాల్సిన పరిస్థితి వస్తుంది అని అన్నారు. జిల్లా మంత్రులుగా నేను ,శ్రీధర్ బాబు ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, కవ్వంపల్లి సత్యనారాయణ , మేడిపల్లి సత్యం మేము అండగా ఉంటాం అని, ఎవరు ఆత్మహత్యలు చేసుకోవద్దు అని,ఆర్థికంగా మీకు దారీ చూపెడతాం అని అన్నారు.చేనేత కార్మికులకు అండగా ఉండే బాధ్యత మాది అని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని దేనిని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ , కరీంనగర్ పార్లమెంటు ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు , సిరిసిల్ల కాంగ్రెస్ ఇంచార్జీ కేకే మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డిపేట మండలంలో వేరువేరు చోట్ల వీధి కుక్కల దాడి



**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలో రెండు వేరువేరు చోట్ల వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ నలుగురిని గాయపరిచాయి. స్థానిక వివరాల ప్రకారం కొత్త బస్టాండ్ సమీపంలో మెహరీన్ అనే మహిళ ఇంటిముందు బీడీలు చేసుకుంటుండగా అదే వీధికి చెందిన కుక్క స్వైర విహారం చేస్తూ మహిళపై నాలుగు చోట్ల గాయపరిచింది. గాయాలైన మహిళ అరుపులు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి కుక్కను తరిమికొట్టారు. రాగట్లపల్లి గ్రామ శివారులోనిఇద్దరు చిన్నారులు లాస్య, ఓ బాలుడు ఓ వృద్ధురాలిపై వీధి కుక్కలు సరిహనం చేసి గాయపరిచాయి.ఈ ప్రమాదంలో లాస్యకు తీవ్ర గాయాలు కాగా వెంటనే కుటుంబ సభ్యులు వీరి ఇరువురిని సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.రోజురోజుకు వీరికి కుల సైరవిహారాలు ఎక్కువై ప్రజలపై చిన్నపిల్లలపై దాడులు చేయడంతో స్థానిక ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని వీధి కుక్కల భారీ నుంచి కాపాడాలని ప్రజలు వేడుకుంటున్నారు.

## 4 ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన పేదింటి బిడ్డ "సౌజన్య "

- తండ్రి కల కోసం ప్రభుత్వ ఉద్యోగం..

**బలగం టీవీ, గంభీరావుపేట :**



ఒకటి కాదు..రెండు కాదు.. నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది యువతి . ఒక్క ఉద్యోగం సాదించటవేం కష్టమనుకునే ఈ రోజుల్లో నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నది ఆ యువతి.. ప్రభుత్వ ఉద్యోగం అనేది చదువుకున్న ప్రతి ఒక్కరి కల. ప్రస్తుతమున్న పోటీ ప్రపంచంలో ఒక్క ప్రభుత్వ ఉద్యోగం సాధించడమనేది చాలా కష్టమైన పని. తమ కలల ఉద్యోగ సాధన కోసం యువత నిరంతరం రాత్రి పగలు లెక్క చేయకుండా కష్టపడి చదువుతుంటారు. అందరూ సక్సెస్ కాలేకపోవచ్చు, పలుసార్లు ప్రయత్నిస్తే కాని ఉద్యోగం రాని పరిస్థితి. ప్రైవేటు రంగంలో మంచి వేతనంతో అవకాశం వచ్చిన, తండ్రికిచ్చిన మాట కోసం, ఆ తండ్రి కల కోసం ఆత్మవిశ్వాసంతో ఎలాంటి కోచింగ్ లేకుండా సొంత ప్రిపరేషన్తోనే నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది యువతి. గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన బంటు నర్సింలు కౌసల్య దంపతులకు ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు. కూతురు సౌజన్య మల్లారెడ్డిపేటలోని జడ్పీ హైస్కూల్లో పదవ తరగతి పూర్తి చేసి, బాసర త్రిబుల్ ఐటీ లో బీటెక్ పూర్తి చేసింది. సౌజన్య తండ్రి నర్సింలు ఎంతో కష్టపడి కుటుంబాన్ని పోషించేవారు, ప్రభుత్వ ఉద్యోగం కచ్చితంగా సాధించా లని కల కన్న తండ్రి కలను ఎట్టకేలకు ఆ కలను నెరవేర్చింది. బీటెక్ పూర్తయి ఉస్మానియా యూనివర్సిటీలో ఎంటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న పుడు, 2019 లో మొదటిసారిగా పంచాయతీరాజ్ సెక్రెటరీగా ఉద్యోగం సాధించింది. నియామక పత్రం అందుకునే లోపే తండ్రి నర్సింలు అనారోగ్యంతో మృతి చెందాడు. ఆ బాధతోనే పంచాయతీరాజ్ సెక్రెటరీగా జాయిన్ అయ్యారు. ఆ బాధను దిగమింగుకుంటూనే అదే సంవత్సరం 2019లో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ గా ఉద్యోగం సాధించింది. 2023లో జ్యుడీషియల్ డిపార్ట్మెంట్ లో జూనియర్ అసిస్టెంట్ గాఎంపికై, ప్రస్తుతం జూనియర్ అసిస్టెంట్ గా సిరిసిల్ల కోర్టులో విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల విడుదలైన గ్రూప్ 4 ఫలితాల్లో జూనియర్ అసిస్టెంట్ గా ఎంపికయ్యారు. ఏకంగా నాలుగు ఉద్యోగాలు సాధించడంతో పలువురు కి సౌజన్య ఆదర్శంగా నిలిచింది.

## శాంతిభద్రతల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట..

- జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన 46 సీసీ కెమెరాలు ప్రారంభం.
- రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్...



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

రాష్ట్ర ముఖ్యమంత్రి నాయకత్వంలో రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు పెద్ద పీట వేస్తూ అనేక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు . శుక్రవారం ఐడీఓసీ ఆవరణలో జిల్లా పరిధిలో సిరిసిల్ల, వేములవాడ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 46 సీసీటీవీ కెమెరాలను వర్చువల్ ద్వారా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ లతో కలసి ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణనే ధ్యేయంగా పోలీసులు విధులు నిర్వహించడం జరుగుతుందని, రాష్ట్రంలో పటిష్ట శాంతిభద్రతల కారణంగా రాష్ట్రానికి కొత్త పెట్టుబడులతో పాటు, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడడంతో పాటు అనేక రంగాల్లో అభివృద్ధి గణనీయంగా జరుగుతుందనిఅన్నారు . జిల్లాలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు, వ్యాపారస్తులు, ప్రజలు స్వచ్ఛంధంగా ముందుకు రావాలని,ఒక సీసీ కెమెరా 100 మంది పోలీస్ వారితో సమానమని, నేరాల నియాత్రణలో, శాంతి భద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమనిఅన్నారు . జిల్లాలో నేరాల నియంత్రణ కోసం వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ కేంద్రానికి అనుసంధానం చేయడం జరిగిందని,కమాండ్ కంట్రోల్ ద్వారా జిల్లాలో ఎలాంటి సంఘటనలు జరిగినా సీసీ కెమెరాల ద్వారా గుర్తించవచ్చు అన్నారు. జిల్లాలో గ్రామాలలో పట్టణాలలో శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా, విజిబుల్ పోలీసింగ్,విలేజ్ పోలీస్ అధికారి వ్యవస్థ పకడ్బందీగా అమలు చేస్తున్న జిల్లా పోలీస్ యంత్రాగాన్ని మంత్రి ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ మురళి కృష్ణ, వేములవాడ పట్టణ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ పాల్గొన్నారు.

## ఐఎంఏ మహిళా అధ్యక్షురాలిగా డా. లీలా శిరీష..



**బలగం టీవీ , సిరిసిల్ల**

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మహిళా విభాగం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షురాలు గా ప్రముఖ సీనియర్ గైనకాలజిస్ట్ డా.లీలా శిరీష ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.రాబోవు రెండు సంవత్సరాలు డా.లీలా శిరీష ఈ పదవిలో కొనసాగుతారు .తన ఎన్నికకు సహకరించిన తోటి వైద్యులకు డా.లీలా శిరీష కృతజ్ఞతలు తెలిపారు .పలువురు వైద్యులు డా.శిరీష కి శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో నూతన ఐ ఎం ఎ జిల్లా అధ్యక్షుడు డా.శ్రీనివాస్,కార్యదర్శి డా.అభినయ్, రాష్ట్ర అధ్యక్షుడు డా.కిషన్, జిల్లా వైద్యాధకారి డా.వసంతరావు,జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి డా.పెంచలయ్య,జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ డా.లక్ష్మి నారాయణ,ప్రముఖ వైద్యులు డా.సత్యనారాయణ స్వామి, డా.మనోహర్, డా.శంకర్, డా.ప్రసాదరావు, డా.రమణారావు,డా. రవీంద్ర,డా. తిరుపతి మరియు మహిళా వైద్యులు డా. శోభారాణి, గీతావాణి,అరుణ తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల :**

గిరిజనులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపునిచ్చారు. గిరిజన సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో గిరిజన హక్కుల కోసం పోరాడిన ఉద్యమ నాయకుడు బిర్సా ముండా 150 జయంతి సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరై ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, బిర్సా ముండా చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు. ధర్తి ఆబ జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ గిరిజన సంక్షేమం,సంకల్పం నుంచి సత్వర ఆచరణ దిశగా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన హక్కుల కోసం పోరాడిన ఉద్యమ నాయకుడు బిర్సా ముండా అని కొనియాడారు. దేశంలోని 63,843 గిరిజన గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రూ. 79,156 కోట్లతో రానున్న ఐదేళ్లలో కనీస వసతులు కల్పించేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని అన్నారు . అన్ని శాఖల సమన్వయంతో గిరిజనుల ఆర్థిక అభివృద్ధి, వసతి, విద్యా, ఉపాధి కల్పన కోసం ఈ పథకాన్ని బిర్సా ముండా జయంతి సందర్భంగా ప్రారంభించిందని అన్నారు . అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.

**ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన..**

ఖే లో ఇండియా జాతీయస్థాయి సైక్లింగ్ పోటీల్లో గిరిజన విద్యార్థిని మలావత్ సౌందర్య బంగారు పతకం సాధించడంతో ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. అలాగే రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిలో పలు పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అధికారులు అభినందించి, రానున్న రోజుల్లో కూడా అన్ని పోటీల్లో రాణించి జాతీయ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు.ఇక్కడ డీ టీ డబ్ల్యూ ఓ జనార్ధన్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పుట్టు కాంగ్రెస్ వాది సిరిసిల్ల నాగుల సత్తన్న..

- 40 ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీలోనే సిరిసిల్ల కాంగ్రెస్ నేత'నాగుల'
- రాజన్న సిరిసిల్ల గ్రంథాలయ చైర్మెన్ గా ప్రమాణ స్వీకారం
- సిరిసిల్ల కాంగ్రెస్లో పుట్టు కాంగ్రెస్ వాదులు జీరోలు..పెట్టు కాంగ్రెస్వాదులు హీరోలు..!

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత నాగుల సత్యనారయణగౌడ్ శుక్రవారం సిరిసిల్ల జిల్లా గ్రంథాలయ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన కాంగ్రెస్ పార్టీ 40 ఏండ్లుగా కొనసాగుతున్నారు. పుట్టు కాంగ్రెస్ వాదిగా నాగుల సత్తన్న పేరుగాంచారు. కాంగ్రెస్ పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న కూడా ఏనాడు పార్టీ మారలేదు. కాంగ్రెస్ పార్టీ కోసమే మొదటి నుంచి పని చేశారు.నాగు సత్యనారయణ గౌడ్కు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవి వస్తుందని అందరు ఊహించారు. కానీ కాంగ్రెస్ అధిష్టానం కేవలం జిల్లా గ్రంథాలయ చైర్మన్ పదవితో నాగుల సత్యనారయణను సరిపెట్టారు. అయిష్టంగానే నాగుల సత్యనారయణ ఈ పదవి తీసుకున్నట్టు తెలిసింది. అలాగే మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్బాబు, పొన్నం ప్రభాకర్ వచ్చేంత వరకు ప్రమాణం స్వీకారం చేసుకోనని భీష్మించుకోని కూర్చుని పదవి వరించిన నెల రోజుల అనంతర ప్రమాణ స్వీకారం చేశారు.

**పుట్టు కాంగ్రెస్ వాది, కాంగ్రెస్ పార్టీకి విధేయుడు ఈ నాగుల సత్తన్న..**

రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ లో నాగుల సత్యనారయణ గౌడ్కు ఒక మంచి పేరుంది. వివాదరహితుడిగా, సీనియర్ కాంగ్రెస్ నాయకుడిగా.. సౌమ్యుడిగా నాగుల సత్యనారయణ గౌడ్కు పేరుంది. కాంగ్రెస్ పార్టీలో నలభై ఏండ్లుగా వివిధ హోదాల్లో కొనసాగారు. పాత తాలుకా కార్యదర్శిగా, యూత్ కాంగ్రెస్ సెక్రటరీగా, పీసీసి మెంబర్ గా, సెస్ చైర్మన్ గా, ఎల్ఎండి డైరెక్టర్ గా , సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిలర్ గా, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా నాగుల సత్యనారయణ గౌడ్ సేవలందించారు. పలు సార్లు ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు అవకాశం ఇవ్వాలని కూడా నాగుల సత్యనారయణ పార్టీకి దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నాగుల సత్యనారయణ గౌడ్కు ఎంఎల్సీ స్థాయి లేదా, కార్పొరేషన్ స్థాయి పదవి వస్తుందిని చాలా మంది ఊహించారు. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్బాబు, పొన్నం ప్రభాకర్ లకు నాగుల సత్యనారయణ గౌడ్ అతి సన్నిహితుడు.కానీ జిల్లా స్థాయి పదవితోనే నాగులను ఒప్పించి పదవి అప్పగించారు. నలభై ఏండ్ల కాంగ్రెస్ జర్నీలో నాగుల సత్యనారయణగౌడ్ ఆర్థికంగా చితికిపోయాడు. పార్టీ కోసం ఖర్చు పెట్టాడు. ఇప్పటికి అప్పులు, ఆర్థిక ఇబ్బందులే నాగులకు మిగిలాయి అని కాంగ్రెస్ పార్టీలోనే చర్చించుకుంటున్నారు.






**సిరిసిల్ల కాంగ్రెస్ పుట్టు తెలంగాణ వాదులను కాదని, పెట్టు తెలంగాణ వాదులకు అందలం**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో కాంగ్రెస్ సీనియర్లకు తీవ్ర ఆన్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీలోనే చర్చ జరుగుతుంది. నిన్న మొన్నటి వరకు పార్టీ మారి, బీఆర్ఎస్ పార్టీలు పదవులు, అధికారం అనుభవించిన వారికే ఎక్కువ ప్రముఖ్యత లభిస్తుందని పలువురు చర్చించుకుంటున్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో ఒకే సామాజిక వర్గానికి కాంగ్రెస్ ముఖ్య నేత ప్రధాన్యత కల్పిస్తూ.. కాంగ్రెస్ సీనియర్లను నిర్లక్ష్యం చేయడంతో కాంగ్రెస్ నాయకులే ప్రెస్మీట్లు పెట్టి ఆ నేత తీరును విమర్శించారు. కాంగ్రెస్ అధిష్టానానికి ఫిర్యాదులు చేశారు. తన ప్రవర్తనతో.. నోటీ దురసుతో సిరిసిల్ల కాంగ్రెస్కు ఎంత చెడ్డపేరు, నష్టం చేస్తున్నారో.. అధికారం చెలాయిస్తూ.. కాంగ్రెస్ సీనియర్లను ఎలా ఇబ్బందులకు గురి చేస్తున్నరో ఎప్పటికప్పుడు కాంగ్రెస్ అధిష్టానానికి కాంగ్రెస్ సీనియర్లు రిపోర్ట్ పంపిస్తున్నారు.ఆ నేత తీరుతో సిరిసిల్ల పద్మశాలీ సమాజం మొత్తం కాంగ్రెస్ దూరమవుతున్నారన ఆరోపణలు ఉన్నాయి. అధికారం రాక ముందు ఒకల, వచ్చాక మరోకలా.. మరి విచ్చలవిడి చేయడంతో కాంగ్రెస్ పార్టీకి తీవ్ర నష్టం జరిగే పరిస్థితి రావడంతో కాంగ్రెస్ పెద్దలు కూడా సిరిసిల్ల మీద ఫోకస్ చేసి పద్మశాలీ ఓటు బ్యాంకును పెంచుకోవడానికి వారి సంక్షేమానికి కాంగ్రెస్ సర్కార్ పెద్దపీఠ వేయడానికి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లు సీఎం రేవంత్ రెడ్డి తో మాట్లాడి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మహిళ సంఘాల సభ్యులకు కోటీ చీరల అర్డర్లు, యారన్ బ్యాంకును సిరిసిల్లకు మంజూరి చేయడం జరిగిందని పలువురు చర్చించుకుంటున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్కు సిరిసిల్ల నియోజకవర్గ బాధ్యతలు కూడా అదనంగా అప్పగించినట్లు సమాచారం. త్వరలోనే సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జ మార్పు చేయడంతో పాటు.. కరీంనగర్ కు చెందిన కీలక నేతను సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జీగా ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. సిరిసిల్ల నియోజకవర్గ నేతకు ఏదో ఒక ప్రాధాన్యత లేని పదవి ఇచ్చి హైదరాబాద్కు పరిమితం చేస్తే.. సిరిసిల్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అయ్యే అవకాశం ఉందని, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ను కూడా తట్టుకునే నాయకుడిని సిరిసిల్లకు తీసుకువచ్చే పనిలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఉన్నారని విశ్వసనీయ సమాచారం.

# వేములవాడలో 20న పర్యటించనున్న సీఎం..




- **సీఎం రేవంత్ రెడ్డి రాకకు అన్ని ఏర్పాట్లు చేయాలి**
- **ప్రభుత్వ శాఖలు సమన్వయంతో ముందుకు వెళ్లాలి**
- **బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

సీఎం రేవంత్ రెడ్డి ఈ నెల 20 వ తేదీన రాజన్న సిరిసిల్ల జిల్లాకి రానున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. సీఎం రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో చేయాల్సిన ఏర్పాట్లపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లో శుక్రవారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, జిల్లా గ్రంథాలయాల సంస్థ ఛైర్మెన్ నాగుల సత్యనారాయణ, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ లతో కలిసి బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ప్రభుత్వ శాఖల పనితీరు, క్షేత్ర స్థాయిలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరుపై మంత్రి పొన్నం ప్రభాకర్ శాఖల వారీగా సమగ్ర వివరాలు ఆరా తీశారు.

ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని,రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ధృఢ సంకల్పంతో కృషి చేస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటన నేపథ్యంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పర్యటన విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని, సీఎం రాక నేపథ్యంలో వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది జరగకుండా దర్శనం ఏర్పాటు చేయాలనిఅన్నారు

### సమగ్ర కుటుంబ సర్వేపై అపోహలు వద్దు..

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ (సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల) సర్వే పై ప్రజలు అపోహలు పడవద్దని అన్నారు. దేశానికే దిక్సూచిగా తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించడం జరుగుతుందని, క్షేత్ర స్థాయిలో ప్రజలు ఎన్యూమరేటర్లకు సహకరించి వారి వివరాలు ఇవ్వాలని అన్నారు . ప్రజలు ఎవరైనా సర్వేపై అపోహలు, అభ్యర్థనలు లేవనెత్తితే ప్రభుత్వ అధికారులు స్పందించి సర్వే యొక్క ఆవశ్యకత గురించి క్లుప్తంగా వివరించి, వారి అపోహలను తొలగించాలని, ఎలాంటి సంక్షేమ పథకాలు, మిగితా వాటిలో కోత విధించమని అన్నారు.

### రైతులకు ఇబ్బందులు రావద్దు..

జిల్లాలోని రైతులు ధాన్యం విక్రయించేందుకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని, ధాన్యం సేకరించి త్వరగా ఆన్లైన్ చేసి, డబ్బులు రెండు రోజుల్లో పడేలా ఏర్పాట్లు చేయాలనిఅన్నారు . సన్న ధాన్యం విక్రయానికి ఎలాంటి ఇబ్బందులూ రాకుండా చర్యలు తీసుకోవాలని,రైస్ మిల్లర్లు సహకరించకపోతే ఆల్టర్నేట్ గోదాముల్లో ధాన్యం నిల్వ చేయాలని అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బ్యాంక్ గ్యారంటీ ఇచ్చి ధాన్యం దించుకోవాలని రైస్ మిల్లర్లకు సూచించారు. డిఫాల్ట్ రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి చెల్లించాలసిన బకాయిలు ఇవ్వాలని అన్నారు.

### ఇంటిగ్రేటెడ్ హాస్టల్ కోసం భూమి గుర్తించాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ హాస్టల్ కోసం భూమి గుర్తించాలని మంత్రి ఆదేశించారు. ఈ మేరకు ఆయా శాఖల అధికారులు ముందుకెళ్లాలనిఅన్నారు .

### 10 వేల 600 ఇండ్లు మంజూరు చేయాలి..

ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా వేములవాడ నియోజకవర్గం మధ్యమానేరు నిర్వాసితుల కోసం 10 వేల 600 ఇండ్లు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. ఇక్కడ ఆయా శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు మూసీ పక్కనే
# పేదల ఇళ్లలో నిద్రిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్ రెడ్డి పాలన కూడా కొనసాగుతోందని పోల్చారు. రాష్ట్రంలో అవే అబద్ధాలు, అరాచకాలు నడుస్తున్నాయని మండిపడ్డారు. రైతులకు ఇచ్చిన ఒక్క హామీని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ సోదరుల డైరెక్షన్‌లోనే రాష్ట్రంలో పోలీసు నియామకాలు, బదిలీలు జరుగుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ చర్యల వల్లే వికారాబాద్‌లో కలెక్టర్‌పై గ్రామస్థులు దాడి చేశారంటూ కిషన్ రెడ్డి మండిపడ్డారు. కక్ష సాధింపు చర్యలతో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడుతోందన్నారు. కాంగ్రెస్‌కు ఏకైక ఏటీఎమ్‌గా తెలంగాణ మారిందన్నారు.మూసీ ప్రక్షాళనకు బీజేపీ వ్యతిరేకం కాదని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో పేదల ఇండ్లు కూల్చేస్తూ.. నల్గొండలో రైతులను రెచ్చగొడుతుండటం తప్ప వాళ్లు చేసేదేమీ లేదన్నారు. కేటీఆర్‌ను అరెస్ట్ కాకుండా బీజేపీ అడ్డుకుంటుందనేది పూర్తిగా అసత్య ప్రచారమని కిషన్ రెడ్డి కొట్టిపారేశారు.

మరోవైపు.. వనవాసి, గ్రామవాసి, నగరవాసి సమ్మేళనంతో లోక్ మంథన్ -2024 నిర్వహించనున్నట్లు కిషన్ రెడ్డి తెలిపారు. ఇందులో హైదరాబాద్ నగరవాసులతో పాటు, తెలంగాణ ప్రజలందరూ పాల్గొనాల్సిందిగా కోరారు.

### గాడిద పాల పేరిట రూ.100 కోట్ల మోసం..!

**బలగం టీవీ, హైదరాబాద్**

గాడిద పాల ఉత్పత్తి పేరిట తమిళనాడులోని చెన్నైకి చెందిన డాంకీ ప్యాలెస్ సంస్థ రూ.100 కోట్ల మోసానికి పాల్పడిందని ఆరోపణలు వస్తున్నాయి.బాధితులు శుక్రవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ 'రైతులకు ఒక్కో గాడిదను రూ.లక్షన్నరకు డాంకీ ప్యాలెస్ సంస్థ అమ్మింది. వాటి నుంచి వచ్చే పాలను లీటర్‌కు రూ.1600ల చొప్పున కొనుగోలు చేస్తామని ఒప్పందం కుదుర్చుకున్నది. మూడు నెలల పాటు రూ.1600లకు లీటర్ చొప్పున కొనుగోలు చేసి రైతుల్లో నమ్మకం కలిగించింది. తర్వాత 18 నెలల నుంచి కాలయాపన చేస్తూ వస్తోంది. దీంతో మోసపోయామని భావించి మీడియా ముందుకు వచ్చాము' అని తెలిపారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు న్యాయం చేయాలని కోరారు.

# శాంసన్, తిలక్‌ల విధ్వంసం

## నాలుగో టీ20లో 135 పరుగుల తేడాతో భారత్ ఘన విజయం సిరీస్ కైవసం



**బలగం టీవి, జొహానెస్‌బర్గ్**

దక్షిణాఫ్రికాతో జరిగిన ఆఖరి టీ20లో భారత్ బ్యాటర్లు సంజూ శాంసన్, తిలక్ వర్మలు చెలరేగిపోయారు. సౌతాఫ్రికా బౌలింగ్ ను ఊచకోత కోస్తూ ఇద్దరూ మెరుపు సెంచరీలు బాదారు. అనంతరం బౌలర్లు విజృంభించడంతో భారత్ 135 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-1తో కైవసం చేసుకుంది.

చివరి 4వ టీ20 మ్యాచ్‌లో భారత్ తొలుత బ్యాటింగ్ చేసి 283/1 పరుగులు చేసింది. సంజు, తిలక్ శతకాలతో అదరగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన సఫారీ జట్టు తడపడింది. నాలుగు ఓవర్లలోపే నాలుగు వికెట్లు కోల్పోయింది. 18.2 ఓవర్ల వద్ద 148కి ఆలౌటైంది. భారత బౌలర్లలో హర్షదీప్ 3, వరుణ్ 2, అక్షర్ 2 వికెట్లు తీశారు. హార్దిక్, రవి బిష్ణోయ్, రమణ్‌దీప్ తలో వికెట్ పడగొట్టారు.

బ్యాటింగ్‌లో సంజు శాంసన్, తిలక్ వర్మ పోటీ పడి మరీ స్టేడియంలో పరుగుల వరద పారించారు. సంజు శాంసన్ 56 బంతుల్లో 9 సిక్సర్లు, 6 ఫోర్లతో 111 పరుగులు చేయగా.. తిలక్ వర్మ 47 బంతుల్లో 10 సిక్సర్లు, 9 ఫోర్లు బాది 120 పరుగులు చేసి అజేయంగా నిలిచారు. ఈ సెంచరీలతో సంజూ, తిలక్‌లు వరల్ట్ రికార్డ్ క్రియేట్ చేశారు. అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో రెండో వికెట్‌కు అత్యధిక భాగస్వామ్యం నమోదు చేసిన జోడిగా సంజు శాంసన్, తిలక్ వర్మ ప్రపంచ రికార్డ్ సృష్టించారు. అంతకు ముందు 2022, జూన్ 28న ఐర్లాండ్‌పై భారత బ్యాట్స్‌మెన్ సంజూ శాంసన్, దీపక్ హుడా రెండో వికెట్‌కు 176 పరుగులు భాగస్వామ్యం నెలకొల్పారు. ఇప్పటి వరకు టీ20ల్లో సెకండ్ వికెట్‌కు ఇదే హ్యాయెస్ట్ పార్ట్‌నర్‌షిప్. ఇప్పుడు ఈ రికార్డ్‌ను సంజు శాంసన్, తిలక్ వర్మ జోడి బద్దలు కొట్టింది. వీరిద్దరూ రెండో వికెట్‌కు 86 బంతుల్లోనే ఏకంగా 210 పరుగులు చేసి టీ20ల్లో రెండో వికెట్‌కు అత్యధిక భాగస్వామ్యం నమోదు చేసిన జోడిగా చరిత్ర సృష్టించారు.




# పేద గిరిజన రైతులపై నీ ప్రతాపమా?

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ కార్యకర్తలను వదిలేశారట. బీఆర్ఎస్ వాళ్ల 21 మందిని రిమాండ్‌కు పంపి.. మిగతా వారిని ఇంటికి పంపించచారట. కేవలం బీఆర్ఎస్ వాళ్లనే మాత్రమే జైల్లో పెట్టాలని అనుముల తిరుపతి రెడ్డి ఆదేశాలు ఇచ్చారట. ఎలాంటి పదవి లేని తిరుపతి రెడ్డికి అధికారులు, పోలీసులు మోకరిల్లుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. తమ చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకు, సిగ్గులేకుండా రాజకీయ రంగు పులిమి బెదిరించే ప్రయత్నం చేస్తున్నారు రేవంత్ రెడ్డి. అరెస్టు అయిన వారిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులు ఉన్నారు. రైతులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి చిత్రహింసలు పెట్టారు. కొడంగల్ ఎస్సై, సీఐ, వికారాబాద్ ఎస్పీ కలిసి మూడు గంటల పాటు కొట్టారు. బాధితుల కాళ్లు చేతులు కమిలిపోయి ఉన్నాయి. మెజిస్ట్రేట్ ముందు మిమ్మల్ని కొట్టినట్టు మీరు చెప్తే మళ్లీ కొడుతాం.. మీ ఇంటోళ్లను కూడా కొడుతామని హెచ్చరించారట. అమానవీయంగా, క్రూరంగా పోలీసులు వ్యవహరిస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు.

ఒసామా బిన్ లాడెన్ లాంటి తీవ్రవాదుల కోసం ఎలా ఆపరేషన్ చేస్తారో.. అలా లగచర్లలో ఇంటింటి తలుపులు పగులగొడుతూ.. కొందరు ప్రయివేటు వ్యవక్తులు బూతులు మాట్లాడుతూ దాడులకు పాల్పడ్డారు. పిల్లలను భయభ్రాంతులకు గురి చేశారు. రేవంత్ రెడ్డి ఒకటి గుర్తు పెట్టుకోవాలి.. ఈ భూమీమ్మద ఎవరూ కూడా శ్వాతం కాదు.. నీ పదవి ఐదేండ్లు మాత్రమే. ఢిల్లీ వాళ్లకు కోపం వస్తే రేపోఎల్లుండో తీసేస్తే దిక్కు లేదు నీకు. ఒకటే గుర్తు చేస్తున్నా.. నీవు రాజు, చక్రవర్తివి కాదు. ఒకటి మాత్రం పక్కా ఎస్సీ, ఎస్టీ, బీసీ సన్నకారు రైతుల భూములు గుంజుకుంటా.. మా అల్లుడికి ఫార్మా కంపెనీ పెట్టిస్తా అంటే తెలంగాణ సమాజం తిరగబడితది.. ఇప్పుడు కొడంగల్ మర్లబడ్డది.. రేపు తెలంగాణ మర్లబడతది అని కేటీఆర్ హెచ్చరించారు.

మేం అధికారంలోకి వచ్చాక నిన్ను ఏం చేయాలో మాకు తెలుసు. ఇవాళ జైల్లో పెట్టిన 21 మంది కుటుంబాల ఉసురు నీకు తప్పకుండా తగలుతది. బాధిత రైతులకు, వారి కుటుంబాలకు బీఆర్ఎస్ అండగా ఉంటది. బెయిల్ కోసం న్యాయ పోరాటం చేస్తాం. రాఘవేంద్ర యాదవ్ అనే ప్రభుత్వ ఉద్యోగిని కూడా అరెస్టు చేసి జైల్లో వేశారు. రేవంత్ మెడలు వంచి అతనికి ఉద్యోగం ఇప్పిస్తాం.. అవసరమైతే సుప్రీంకోర్టు దాకా వెళ్తాం. నీ ఉద్యోగం పోనివ్వం. తిరుపతి రెడ్డి దౌర్జన్యాలకు భయపడొద్దు.. ధైర్యంగా ఉండండి.. ప్రజాస్వామ్యబద్ధంగా కొట్లాడుదాం. న్యాయ స్థానాల్లో పోరాటం చేసి బయటకు తీసుకువస్తామని భరోసా

**ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ప్రముఖ ఆలయాలు శుక్రవారం కార్తీక శోభను సంతరించుకున్నాయి. వేములవాడ రాజన్న ఆలయం, ధర్మపురి నృసింహ క్షేత్రం దీపకాంతులతో దేదీప్యమానంగా వెలుగొందాయి. వేములవాడ ఆలయ ప్రాంగణంలో దీపకాంతులు దర్శనమిచ్చాయి. ఆలయానికి భక్తులు పోటెత్తారు. కార్తీకపౌర్ణమి సందర్భంగా రాత్రి ఆలయంలో జ్వాలాతోరణ కార్యక్రమాన్ని కనులపండువగా నిర్వహించారు. ధర్మపురి బ్రహ్మపుష్కరిణి (కోనేరు)ని వేలాది దీపాలతో అలంకరించారు.**



# డాకు మహారాజ్ గా బాలయ్య




**బలగం టీవి, హైదరాబాద్**

నందమూరి బాలకృష్ణ, డైరెక్టర్ బాబీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న లేటెస్ట్ మూవీ టైటిల్‌తో పాటు టీజర్‌ను శుక్రవారం విడుదల చేశారు. 'డాకు మహారాజ్' అనే పేరును ఫిక్స్ చేశారు. "ఈ కథ వెలుగుని పంచే దేవుళ్లది కాదు. చీకటిని శాసించే రాక్షసులది కాదు. ఆ రాక్షసులను ఆడించే రావణుడిదీ కాదు. ఈ కథ రాజ్యం లేకుండా యుద్ధం చేసిన ఒక రాజుది. గండ్ర గొడ్డలి పట్టిన యమధర్మరాజుది. మరణాన్నే వణికించిన మహారాజుది" అంటూ ఓ పవర్ ఫుల్ డైలాగ్ తో టీజర్ ఆద్యంతం చాలా ఇంట్రెస్టింగ్‌గా సాగింది. "గుర్తుపట్టావా నన్ను. నేనే డాకు మహారాజ్" అంటూ బాలయ్య చెప్పే డైలాగ్స్, విజువల్స్ అభిమానులను తెగ ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా టీజర్ ఆఖరిలో బాలయ్య న్యూ లుక్ నెట్టింట తెగ వైరల్ అవుతోంది. అంతేకాకుండా ఈ సినిమాపై భారీ అంచనాలను పెంచుతోంది.

చిత్రంలో బాలీవుడ్ డ్యాన్సింగ్ క్వీన్ ఊర్వశి రౌతేలా, శ్రద్ధా శ్రీనాథ్ ఫీమేల్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. ఈ మూవీని సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమా బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ , సాయి సౌజన్య సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.అయితే ఈ టైటిల్ టీజర్ లాంచ్



ఈవెంట్ సందర్భంగా దర్శకుడు బాబీ మాట్లాడుతూ బాలయ్య ఎలాంటి డూప్ లేకుండా స్టంట్స్ చేసినట్లు వివరించారు. " ఎలా ఉంది, రీసౌండ్ ఉందా? కంద్రగొడ్డలి పట్టిన యమధర్మ రాజు ఎట్లున్నాడు. టీజర్‌లో చూపించిన దాంట్లో డూప్‌లు లేవు, డూప్లికేట్‌లు లేవు. గుర్రం ఎక్కింది ఆయనే, నడిపింది ఆయనే. యుద్ధానికి వచ్చేది కూడా ఆయనే. అన్నీ ఒరిజినల్ షాట్స్. మీరు చాలా కాలం నుంచి సహనంగా ఉన్నందుకు థ్యాంక్స్? ఎప్పుడూ చూడని బాలయ్యను చూపిస్తున్నాం. ఇది పక్కా మాస్ సినిమా ఇది. సినిమా వేరే లెవెల్లో ఉంటుంది. తమన్ మ్యూజిక్ చూసినప్పుడు, స్పీకర్స్ ఓనర్స్ నా మీద, తమన్ మీద కేసు వేస్తారేమో అనిపించింది." అని అన్నారు.


# 'కుబేర' గ్లింప్స్ రిలీజ్

**బలగం టీవి, హైదరాబాద్**

తమిళ నటుడు ధనుష్ కథానాయకుడిగా రూపొందుతోన్న తాజా చిత్రం 'కుబేర'. శేఖర్ కమ్ముల ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. రష్మిక మందన్న కథానాయికగా నటిస్తుండగా.. టాలీవుడ్ అగ్ర నటుడు అక్కినేని నాగార్జున కీలక పాత్రలో ఈ సినిమాలో నటిస్తున్నాడు. ఇప్పటికే మూవీ నుంచి వరుస అప్‌డేట్‌లను పంచుకున్న చిత్రబృందం తాజాగా ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేసింది.




స్టోరీ అసలు చెప్పకుండా ముంబై మహానగరాన్ని చూపిస్తూ టీజర్‌ను కట్ చేశారు మేకర్స్. ఇక ధనుష్ ఇందులో బిచ్చగాడి పాత్రల్లో కనిపించ నుండగా.. నాగార్జున బిజినెస్ టైకున్ పాత్రలో మెరవబోతున్నాడు. ఏషియన్ సినిమాస్ అధినేత సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్‌రావుతో కలిసి ఈ సినిమాను సంయుక్తంగా నిర్మిస్తున్నాడు. ఈ పాన్ ఇండియా చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్.




# విజయ్ దేవరకొండ 'సాహిబా' విడుదల

**బలగం టీవి, హైదరాబాద్**

టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ సాహిబా అనే ఆల్బమ్‌లో నటించాడు. ఇందులో విజయ్‌కి జంటగా.. రాధిక మదన్ కనిపించనుంది. ఇప్పటికే ఈ ఆల్బమ్ నుంచి ప్రోమో విడుదల చేసిన మేకర్స్ తాజాగా ఫుల్ వీడియోను పంచుకున్నారు. ఈ ఆల్బమ్‌లో విజయ్ ముస్లిం ఫొటోగ్రాఫర్‌గా కనిపించగా రాధిక మదన్ రాజవంశానికి చెందిన రాకుమారిగా కనిపించింది. ఇక సుధాంశు సరియా దర్శకత్వంలో వచ్చిన ఈ 'సాహిబా' ఎలా ఆకట్టుకుంటుందో వేచి చూడాలి మరి.



# వేలం ముహూర్తం ఖరారు

**బలగం టీవి, హైదరాబాద్**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ మెగా వేలానికి ముహూర్తం ఖరారైంది. ఇప్పటికే షెడ్యూల్ విడుదల చేసిన ఐపీఎల్ పాలకమండలి వేలం సమయం కూడా ఖరారు చేసింది. ఈ మేరకు శుక్రవారం సాయంత్ర ఐపీఎల్ యాజమాన్యం ఎక్స్ వేదికగా వేలం సమయాన్ని వెల్లడించింది. నవంబర్ 24వ తేదీ మధ్నాహ్నం 3:30 గంటలకు జెడ్డాలో మెగా వేలం మొదలవ్వనుంది. రెండో రోజైన 25న కూడా అదే సమయానికి ఆక్షనీర్ కనీస ధరను బట్టి క్రికెటర్ల పేర్లను చదువనున్నారు.

ఐపీఎల్ మెగా వేలంలో 1,574 మంది క్రికెటర్లు పేర్లు నమోదు చేసుకున్నారు. కానీ, చివరకు వడబోత అనంతరం 574 మంది మాత్రమే వేలం పాటలో నిలిచారు. వీళ్లలో 81 మంది ఆటగాళు రూ.2 కోట్ల కనీస ధర పలుకుతున్నారు. మొత్తంగా 574 మంది క్రికెటర్లలో భారతీయులు 366 మంది (48 మంది అన్‌క్యాప్డ్‌తో కలిపి) ఉండడం విశేషం. ఇక విదేశీ ఆటగాళ్లు 208 మంది.. 193 మంది అన్‌క్యాప్డ్ ప్లేయర్లతో పాటు అనుబంధ దేశాలకు చెందిన 12 మంది వేలంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.



# పాకిస్థాన్‌లో చాంపియన్స్ ట్రోఫీ టూర్ రద్దు

**బలగం టీవి, హైదరాబాద్**

పాకిస్థాన్ చాంపియన్స్ ట్రోఫీ టూర్‌కు అనుమతిచ్చిన అంతర్జాతీయ క్రికెట్ మండలి శుక్రవారం కీలక నిర్ణయం తీసుకుంది. చాంపియన్స్ ట్రోఫీని పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో సందర్శనకు ఉంచాలనుకున్న పాకిస్థాన్ బోర్డుకు ఝలక్ ఇచ్చింది. వివాదాస్పద ప్రాంతాల్లో ట్రోఫీని ప్రదర్శించేందుకు అనుమతి లేదంటూ మొత్తం టూర్‌ను రద్దు చేసింది. భారత క్రికెట్ నియంత్రణ మండలి అభ్యంతరాల మేరకు ఐసీసీ ఈ నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. చాంపియన్స్ ట్రోఫీ ప్రచారంలో భాగంగా నవంబర్ 14వ తేదీన ఐసీసీ ట్రోఫీని పాకిస్థాన్‌కు అందజేసింది. ఇస్లామాబాద్ చేరుకున్న ఆ ట్రోఫీని పీసీబీ వారం రోజులు (నవంబర్ 16 నుంచి 24 వరకూ ) తమ దేశమంతా తిప్పాలనుకుంది. ఇదే విషయాన్ని పీసీబీ అధికారికంగా వెల్లడించింది కూడా. పీసీబీ ఆ పోస్ట్ పెట్టిన మరునాడే ఐసీసీ టూర్‌ను రద్దు చేస్తూ నిర్ణయం వెలువరించింది.

# సమ్మర్‌కు 'కన్నప్ప'

**బలగం టీవి, హైదరాబాద్**



టాలీవుడ్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రాల్లో 'కన్నప్ప' కూడా ఒకటి. మంచు విష్ణు హీరోగా నటిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని బాలీవుడ్ దర్శకుడు ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం చేస్తున్నాడు. అయితే, 'కన్నప్ప' చిత్రాన్ని డిసెంబర్ లో రిలీజ్ చేస్తామని చిత్ర యూనిట్ గతంలో వెల్లడించింది. కానీ ఇప్పుడు ఈ సినిమాను డిసెంబర్‌లో రిలీజ్ చేయడం లేదని మంచు విష్ణు క్లారిటీ ఇచ్చాడు. తాజాగా ఆయన తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "కన్నప్ప చిత్రాన్ని డిసెంబర్‌లోనే రిలీజ్ చేయాలని ప్లాన్ చేశాం.. కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ చిత్రాన్ని సమ్మర్ 2025లో తీసుకొస్తున్నాం" అని తెలిపారు. ఇక ఈ సినిమాలో మోహన్ బాబు, శరత్ కుమార్, ముఖేష్ రిషి, బ్రహ్మానందం వంటి స్టార్స్ ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా.. మోహన్ లాల్, అక్షయ్ కుమార్, ప్రభాస్, కాజల్ అగర్వాల్ వంటి వారు క్యామియో రోల్స్ చేస్తున్నారు.